ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
మంగళవారం 2 జనవరి 2024 | 5



నూతన సంవత్సర శుభాకాంక్షలతో కడియపులంక సత్యదేవా నర్సరీలో 60 వేల మొక్కలతో అలంకరించిన అయోధ్య రామమందిరం నిర్మాణ ప్రతీక.. కడియపులంకలో పుష్పగుచ్ఛాలు



నూతన సందడే!

ఊరూ వాడా నూతనోత్సాహం

ఉత్సాహం ఉరకలెత్తింది.. కొత్త ఏడాది ఆనందం తెచ్చింది.. ఉదయం నుంచీ సందడే.. సందడి.. నాయకుల ఇళ్ల వద్ద అభిమానులు క్యూకట్టారు.. కళాశాలలు.. పాఠశాలల్లో విద్యార్థులు లైన్ కట్టారు.. ఇళ్ల వద్ద మహిళలు ఆనందం పంచుకున్నారు.. ఎవరి నోటా విన్నా ఒకటే మాట.. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ అందరికీ శుభాకాంక్షలు చెప్పుకుంటూనే ఉన్నారు.. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సోమ వారం తెల్లవారుజాము నుంచే సందడి చేశారు. కొత్త ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.. ఈ సందడిలో అందరి నోటా వినిపించిన మాట ఒక్కటే.. ఈ ఏడాది మారాలి.. మారాలంటే.. మార్పు మనతోనే ఆరంభం కావాలి.. ఎవరిని ఎన్నుకోవాలో.. ఎలా బతకాలో.. ఎలా గెలవాలో నిర్ణయించుకోవాల్సిందే మీరే.. అందునా ఈ ఏడాది మరీ ప్రత్యేకం.. ఎందుకంటే ఎన్నికల సంవత్సరం.. మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉంది..


ఆదిరెడ్డి వాసుకు శుభాకాంక్షలు

- గుడ్ బై 2023.. వెల్‌కమ్ 2024
- ఆనందంగా స్వాగతించిన జనం
- నాయకుల ఇళ్ల వద్ద భారీ క్యూ
- కలెక్టరేట్‌లో ప్రత్యేక వేడుక
- కిటకిటలాడిన ఆలయాలు, చర్చిలు
- ఈ ఏడాదే రాజకీయ కాక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కొత్త ఆశలు.. ఆశయాలు.. ఆకాంక్షలతో ఈ ఏడాది క్యాలెండర్ మొదలైపోయింది. మహిళల రంగవల్లికల సవ్వడి.. యువత కేరింతలు.. విద్యుత్ దీపాలంకరణలు.. కేక్ కటింగ్‌లు.. స్వీట్ల ప్యాకెట్లు.. మందుబాబుల సందడి నడుమ 2024 వచ్చేసింది. 2023కి ఆవేదనగా వీడ్కోలు చెబుతూ.. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సంబురాలు అంబరాన్నంటాయి. డిసెంబరు 31న సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలు దాటిన మరుక్షణం బాణాసంచా వెలుగులు వెల్లివిరిశాయి. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ కేకలు కెవ్వుమనిపించాయి. ఆ శుభాకాంక్షలతో నూతన సంవత్సరం పరవశించిపోయింది. జనాలు వీధుల్లోకి వచ్చి 2024ని స్వాగతించారు. దేవాలయాలు కళకళలాడాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవాలయాల్లో తెల్లవారుజామునుంచే భక్తుల సందడి మొదలైంది. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. 1న కూడా చర్చిలు, దేవాలయాల్లో వేడుకలు చేసుకున్నారు. కలెక్టర్ నివాసాన్ని, ప్రవేశ ద్వారాన్ని పూలమాలలతో అందంగా అలంకరించారు. కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల, కార్యాలయాల వద్ద పళ్లు, స్వీట్లు, పూలగుచ్ఛాలతో ప్రభుత్వ సిబ్బంది, ప్రజలు క్యూకట్టారు. జిల్లా బాస్‌లు ఇద్దరూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కడియంలోని నర్సరీ యజమానులు రంగుంరంగుల పూలు, మొక్కల ఆకర్షణీయ కూర్పుతో కొత్త ఏడాదికి స్వాగతం చెప్పారు. ఎస్పీ జగదీశ్ స్వీయ పర్యవేక్షణలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా శాంతిభద్రతలకు కావలి కాశారు. ఏదేమైనా.. వడివడిగా వచ్చేసిన 2024లో మొదటిరోజు ఆనందంగా వచ్చి.. సందడిగా పలకరించి వెళ్లింది.

నాయకుల ఇళ్ల వద్ద క్యూ

ఇది పొలిటికల్ ఇయర్. సాధారణ జనానికి ఇది న్యూయర్ కావచ్చు.కానీ రాజకీయనేతలకు అత్యంత ముఖ్యమైన న్యూఇయర్. ఇక 100 రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన,వైసీపీ తదితర నేతలందరి ఇళ్ల వద్ద సందడి నెలకొంది. పార్టీకార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులు భారీగా తరలివచ్చారు. వచ్చిన వారినందరినీ ప్రేమతో పలకరించి నేతలు ఫొటోలు దిగారు. రాజమహేంద్రవరంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఇళ్ల వద్ద జనం క్యూ కట్టారు. రూరల్ నుంచి వేలాదిమంది కార్యకర్తలు, నేతలు తరలివచ్చిన గోరంట్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి అభిమానులు వచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై గోరంట్ల నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఇంటి వద్ద కూడా ఉదయం నుంచే అభిమానులు, పార్టీ కార్యకర్తల సందడి నెలకొంది. చంద్రబాబును మళ్లీ సీఎం చేయడానికి, ప్రజలంతా కొత్త నిర్ణయం తీసుకోవాలని యువనేత ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పిలుపు ఇచ్చారు. సిటీ నుంచి మాజీ కార్పొరేటర్లు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.గుడా మాజీ ఛైర్మన్ గన్నికృష్ణ ఇంటి వద్ద అభిమానులతో సందడి నెలకొంది. జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ తన సతీమణి అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఆసుపత్రిలో ఉండడంతో ఆయన వేడుకలు రద్దు చేసుకున్నారు. జనసేన సిటీ కోఆర్డినేటర్ అనుశ్రీ సత్యనారాయణకు జనసేన శ్రేణులు శుభాకాంక్షలు తెలిపాయి. వైసీపీలో తటస్థంగా ఉంటున్న ఏపీఐఐసి మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం ఇంటి వద్దకు కూడా జనం బారులు తీరారు. అభిమానులు, వివిధ పార్టీ కార్యకర్తలు కూడా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాజానగరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ, జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఇళ్ల వద్దకు కూడా సందడినెలకొంది. అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి పెద్దసంఖ్యలో శుభాకాంక్షలు తెలిపారు. కొవ్వూరులో మాజీ మంత్రి కెఎస్ జవహర్, ద్విసభ్య కమిటీ సభ్యుడు చౌదరి, రామకృష్ణలకు,జనసేన నేత టివి రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో మద్దిపాటి వెంకట్రాజు, దేవరపల్లిలో మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరావు, నిడదవోలు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపూడి శేషారావు, సీనియర్‌నేత కుందుల సత్యనారాయణకు జనం , పార్టీకార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. రాజమహేంద్రవరంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాలకు వైసీపీ కార్యకర్తలు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కొవ్వూరులో మంత్రి తానేటివనిత, గోపాలపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేతలారి వెంకట్రావు, అనపర్తిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, నిడదవోలులో ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ఇళ్ల వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు కొందరు ముందుగా తమ వర్గాలకు సమాచారం పంపించారు. కొంత మంది స్వచ్ఛందంగా వచ్చారు.


హ్యాపీ న్యూ ఇయర్ : నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్, జేసీ తేజ్‌భరత్, డీఆర్‌వో నరసింహులు, కమిషనర్ దినేష్‌కుమార్, ఆర్డీవో చైత్రవర్షిణి, ట్రైనీ జేసీలు తదితరులు


ఎన్నికల్లో కేక పుట్టించాలి : రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి దంపతులకు కేక్ అందజేస్తున్న తెలుగు మహిళా నాయకులు, మహిళలు



తాగారు.. ఊగారు!

- మత్తులో నూతనోత్సాహం
- మూడు రెట్లు పెరిగిన అమ్మకాలు
- రెండు రోజుల్లో రూ.15 కోట్లు
- 1 గంట వరకే అనుమతులు
- తెల్లవార్లూ అమ్మకాలే
- మరో వైపు విచ్చలవిడిగా సారా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తాగండిరా.. ఊగండిరా.. అని సర్కారు ఆదేశిస్తే మందుబాబులు ఊరుకుంటారా..! ఫుల్‌గా లాగించే శారు..జేబులు గుల్ల చేసుకున్నారు.. 2023 పోకడ.. 2024 రాకడ సందర్భంగా జిల్లాలోని మందుబాబులు మందులో ఈతకొట్టారంటే అతిశయోక్తి కాదేమో.. అంతలా మందులో మునిగి తేలారు. దీంతో రెండు రోజుల్లో జిల్లాలో మద్యం అమ్మకాలు 300 శాతం పెరిగాయి. మద్యం ఆదాయంతోనే నడుస్తున్న ప్రభుత్వం ఈ రెండు రోజుల్లో సాధ్యమైనంత ఎక్కువగా మందు జనాల గొంతు దిగాలని ఆదేశించడంతో సుమారు వారం నుంచే కసరత్తు చేసి అధికారులు స్టాకు తగ్గకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఓ వైపు ప్రభుత్వ మద్యం.. మరోవైపు పూటుగా సారా ఫుల్‌గా పట్టేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

రెండు రోజుల్లో రూ.15 కోట్లు

నూతన సంవత్సరం రాక సందర్భంగా డిసెంబరు 31, జనవరి 1న ప్రభుత్వ మద్యం దుకాణాలు, వాకిన్ స్టోర్లు(టూరిజం అవుట్‌లెట్లు) అర్ధరాత్రి 12 గంటల వరకూ.. బార్లు మరో గంట ఎక్కువగా ఒంటిగంట వరకూ తెరిచి తాగించడంటూ ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇది ఆసరాగా తీసుకొని దాదాపుగా తెల్లార్లూ మద్యం అమ్మకాలు సాగించారు. బీర్లు పొంగి పొర్లాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు బాగానే గిట్టుబాటైంది. ఈ రెండు రోజుల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు, బెల్టుషాపులు అన్నీ కలుపుకొని రూ.15 కోట్ల వరకూ మందుబాబుల జేబులకు చిల్లుపడింది. రాజమండ్రి డిపో పరిధిలోని రామచంద్రాపురం, మండపేట, ఆలమూరు, రాజమండ్రి రూరల్, అర్బన్, గోకవరం, కోరుకొండ, చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం రంపచోడవరం, రాజానగరం, కడియం, సీతానగరం, అనపర్తి మండలాల్లోని సుమారు 90 మద్యం దుకాణాలు 8 వాకిన్ స్టోర్లు, 25 బార్లు ఉన్నాయి. ఆయా దుకాణాల్లో డిసెంబరు 31న రూ.6 కోట్లు, జనవరి 1న రూ.4 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. జిల్లాలోని రెండు డిపోల్లో చాగల్లు ఒకటి. కానీ ఈ డిపో ఆదాయం ఏలూరు జిల్లా పరిధిలోకి వస్తుంది. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లోని 9 మండలాల అమ్మకాలు కూడా తూర్పులో కలుపుకుంటే రెండు రోజుల్లో రూ.4కోట్లు ఉండే అవకాశం ఉంది. మిగతా సొమ్ము సారా తాగినవాళ్లు ముట్టజెప్పింది. సాధారణ రోజుల్లో రాజమండ్రి డిపో పరిధిలో రోజుకు రూ.2 కోట్ల మేర అమ్మకాలు నమోదవుతున్నాయి. కానీ డిసెంబరు 31న ఒక్కరోజే రూ.6కోట్ల రాబడి కనిపించింది.

జగనా.. ఇదేం మోసం?

గత నాలుగున్నరేళ్ల నుంచీ నకిలీ బ్రాండ్లు, నాణ్యత లేని సరుకుతో మద్యపానప్రియులు ఇబ్బంది పడుతున్నారు. మంచి మందు కోసం కటకటలాడుతున్నారు. సాధారణ రోజుల్లో బార్లలో దొరికే బ్రాండ్లలో చాలామటుకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరకడం లేదు. ఉదాహరణకు ఎలిఫేంట్ బీరు బార్ల దగ్గర బోర్డులు ఏర్పాటు చేసి మరీ అమ్ముతున్నా.. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మాత్రం కింగ్‌ఫిషర్ బీరు కూడా దొరకదు. బ్రాండ్ల పరిస్థితీ అంతే బార్లలో దొరికే వాటిలో సగం బ్రాండ్లు కూడా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో లభ్యం కావు. కానీ.. పండుగలు, ప్రత్యేక దినాల్లో మాత్రం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కూడా సరుకు ఫుల్లుగా ఉండే విధంగా ప్రభుత్వం శ్రద్ధ చూపుతోంది. కొద్ది రోజుల ముందు నుంచే ప్రణాళిక వేసుకొని అధికారులను సన్నద్ధం చేసి అమ్మకాలు సాగిస్తోంది. ఇలా ప్రభుత్వం మద్యం, నాటుసారా పూటుగా అందుబాటులో ఉంచడంపై మహిళలు మండిపడుతున్నారు. మద్యం దుకాణాల సంఖ్య తగ్గించమంటే ఫుల్లుగా తాగించడమా? అని పాలకులను ప్రశ్నిస్తున్నారు.



సీఎంకి పోస్టు.. కార్డు..

రాజమహేంద్రవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): 'సీఎం గార్కి నూతన సంవత్సర శుభాకాంక్షలు- మా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చండి మహాప్రభో' అంటూ సమగ్ర శిక్షా ఉద్యోగులు జగన్‌కి పోస్టు కార్డులు రాశారు.గత 13 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న విషయం విదితమే. నూతన సంవత్సరం తొలి రోజు సోమవారం దీక్షలో పాల్గొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తాము పడుతున్న ఇబ్బందులను సీఎంకి పోస్టు కార్డుల ద్వారా విన్నవించామని జేఏసీ నాయకులు ఎం.రఘునాథ్, డి.వంశీకృష్ణం రాజు, ఆర్.వెంకట్రాజు,మిరపరాజు, వెంకట్, కరుణాకర్ తెలిపారు. వివిధ సంఘాల నాయకులు శిబిరం వద్ద మద్దతు ప్రకటించారు.

ఆలయాలు కిటకిట



నిడదవోలు, జనవరి 1 : కొత్త ఏడాది ఆరంభం సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడా యి. రాజమహేంద్రవరం, నిడదవోలు, భిక్కవోలులోని ప్రధాన ఆల యాలకు భక్తులు పోటెత్తారు.ఈ సందర్భంగా ఆలయాలను రక రకాల పువ్వులతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున దర్శించు కున్నారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పలువురు భక్తులు పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాల నుంచి ఆలయాలకు తరలివచ్చి దర్శించుకున్నారు.

పాలకుల మంకుపట్టుతో

పౌష్టికాహారం ఎలుకల పాలు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లుతున్న గుడ్ల నుంచి దుర్వాసన
- ఇతర ఆహార పదార్థాలపై ముసురుకుంటున్న ఈగలు
- చిన్నారుల ఆరోగ్యానికి ప్రమాదం
- అంగన్‌వాడీల సమ్మెపై స్పందించని ప్రభుత్వం
- చిన్నారులకు, బాలింతలకు అందని బలవర్ధక ఆహారం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎంత మంది ఇబ్బంది పడినా మా మంకుపట్టు మాదే అంటే పాలకులు బెట్టు వీడడం లేదు. చివరికి గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పౌష్టికాహారంతో ముడిపడి ఉన్న విషయంలోనూ ప్రభుత్వం కాలయాపననే నమ్ముకోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నా అవేమి పట్టించుకోవడం లేదు. అంగన్వాడీలు 19 రోజులుగా తమ డిమాండ్ల సాధనకు పోరాడుతున్నారు. గత ఎన్నికల వేళ అక్కచెల్లెమ్మలంటూ ప్రేమ ఒలకబోసిన సీఎం జగన్ ఇప్పుడు అంగన్వాడీ మహిళలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. అంగన్వాడీల సమ్మెతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే స్పృహ కూడా ప్రభుత్వానికి లేకుండా పోయింది. లబ్ధిదారులు అంగన్వాడీలకే మద్దతు పలుకుతున్నా పాలకులకు మాత్రం వారి సమస్యలు కానరావడం లేదు. దీంతో పౌష్టికాహారం ఎలకలపాలవుతోంది. అంగన్వాడీలను భయపెట్టడానికి వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని అంగన్వాడీ సెంటర్లకు పంపిస్తున్నా ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదు. 19 రోజులుగా సెంటర్లకు గర్భిణులు, బాలింతలు, పిల్లలు రావడం లేదు. ప్రభుత్వ తీరుపై అవగాహన చేసుకోలేని వయసులో ఉన్న పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు తీసుకెళ్లాలని మారాం చేస్తున్నారు. ఓ కానిస్టేబుల్‌కి కూడా ఈ పరిస్థితి ఎదురైంది. అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు ఉన్నప్పుడు లబ్ధిదారులకు అందాల్సిన పౌష్టికాహారాన్ని నిర్దేశిత సమయం ప్రకారం అందజేసేవారు. ఇప్పుడు ఆ క్రమం తప్పింది. కేంద్రాల్లో మిగిలిన/కొత్తగా వచ్చిన గుడ్లు కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. ఈగలు విపరీతంగా ముసురుకుంటున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలకు తరలించారు. దీంతో ఆ పాఠశాలల్లోని పిల్లలకు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఏర్పడింది. కందిపప్పు, బాలసంజీవిని, పల్లీల అచ్చులను ఎలుకలు ఎంచక్కా ఆరగిస్తున్నాయి. ఈ నెలలో మొదటి ఫేజ్‌లో వచ్చిన సరుకులను లబ్ధిదారులకు అంగన్వాడీలు అందజేసిన అనంతరం సమ్మెలో దిగారు. రెండో ఫేజు సరుకుల పంపిణీ తారుమారైంది. అంగన్వాడీ కేంద్రాలను ఇప్పుడు కనీసం శుభ్రం కూడా చేయడం లేదు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ప్రభుత్వం కేంద్రాల తాళాలను బద్దలు కొట్టించింది. కానీ, వాటికి కొత్త తాళాలు లేక ప్రస్తుతం అధిక శాతం కేంద్రాలకు తాళాలు వేయడం లేదు. దీంతో కేంద్రాల్లోని ఆట వస్తువులు, ఫర్నీచర్ వంటివి దొంగలపాలు అవుతాయని అంగన్వాడీలు ఆవేదన చెందుతున్నారు. 2020లో తాము సొంత డబ్బుతో తయారు చేసిన ప్రీస్కూల్ కిట్లు, ఆటపాట వస్తువులు సెంటర్లలో ఉన్నాయని చెబుతున్నారు. కాగా.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 5000 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా తూర్పుగోదావరి జిల్లాలో 1556 సెంటర్లు ఉన్నాయి. ఏడెనిమిది నెలల నుంచీ గ్యాస్ సిలిండర్ల బిల్లులు కూడా అంగన్వాడీలకు చెల్లించడం లేదు.



మామిడికుదురులో ప్రభుత్వ చీరలకు పూజలు చేస్తూ నిరసన

● పౌష్టికాహారం ఇలా

గర్భిణులు, బాలింతలకు నెలలోని 1 నుంచి 6వ తేదీ వరకూ మొదటి విడత, 10-20లోపు రెండో, 20-31లోపు మూడో విడత కింద 1-15వ తేదీలోపు ఒక్కొక్కరికి 13 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, బాలసంజీవిని కిట్ (కర్జూరం 250 గ్రా, బెల్లం 250 గ్రా, పల్లీల అచ్చు 250 గ్రా, రాగిపిండి 2 కిలోలు, అటుకులు 1కిలో), బియ్యం 3 కిలోలు, కందిపప్పు కిలో, వంటనూనె అర లీటరు. రెండో విడత పంపిణీ కింద 16-30వ తేదీలోపు 12 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు ఇస్తారు. మొత్తంగా నెలకు బాల సంజీవిని కిట్ 1, ఎగ్స్ 25, పాలు 5 లీటర్లు రైస్ 3 కిలోలు, కందిపప్పు కిలో, వంటనూనె అరలీటరు అందజేస్తారు. 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు నెలకు 25 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, బాలామృతం ప్యాకెట్ ఇస్తారు. 3-5 ఏళ్లలోపు ప్రీస్కూల్ పిల్లలకు రోజూ గుడ్డు, పప్పుతో భోజనం, 100 మిల్లీ లీటర్ల పాలు ఇస్తారు.

సీఎం, మంత్రుల పేర్ల మంత్రాలతో

అంగన్‌వాడీల పూజలు

- ● నాసిరకం చీరల ప్రదర్శన
- ● పి.గన్నవరంలో వినూత్న నిరసన



మంత్రాలతో పూజలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పి.గన్నవరం, జనవరి 1: ఓం జగన్మోహరెడ్డి నమః, ఓం బొత్సాయన నమః, ఓం సజ్జల రామకృష్ణారెడ్డి నమః, తాడేపల్లి ప్యాలెస్ నమః, ఆకలి మంటాయ నమః అంటూ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు వినూత్నంగా చీరలు, సెల్‌ఫోన్ల పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం అందించిన నాసిరకం చీరలను ప్రదర్శించారు. పి.గన్నవరం-నరేంద్రపురం రోడ్డు మధ్యలో కేక్ కట్ చేసి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విప్లవ గీతాలు ఆలపిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మెకు ఎస్టీయూ మండల శాఖ నాయకులు సంఘీభావం తెలిపారు. జిల్లా అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకుల అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, కె.నాగలక్ష్మి, మట్టపర్తి వెంకటలక్ష్మి, లక్ష్మీకుమారి, కె.కిరణ్మయి, జి.వెంకటరమణ, జె.పద్మమాల, డి.లలిత, కె.వెంకటలక్ష్మి, వరహాలక్ష్మి, అత్తిలి ఉమాశంకరి, జెహార బేబిఆశాలత, ఎన్.మీనాక్షి, కె.గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.



నాసిరకం చీరలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడులు

ఎటపాక, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. గొమ్ముకొత్తగూడెం పంచాయతీ పరిధిలోని ఎర్రబోరు గ్రామ శివారు ప్రాంతంలో కోడి పందేల బరి నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు బరి ఏర్పాటు చేసిన ప్రాంతంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు పందెం కోళ్లతో పాటు రూ.1200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.పార్థసారథి తెలిపారు. సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ పార్థసారథి హెచ్చరించారు.

జనసంచారంలోకి మొసలి పిల్ల



మోతుగూడెం, జనవరి1: చింతూరు మండలం మోతుగూడెం జగదాంబ సెంటర్లో జన సంచారంలోకి మొసలి పిల్ల రావడంతో గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జగదాంబ సెంటర్ కాలనీ వాసులు ఫారెస్ట్ అధికారులకు ఫోన్ చేయడంతో ఫారెస్ట్ అధికారులు దానిని పట్టుకుని పెద్దవాగులో వదిలేశారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులు

జగ్గంపేట, జనవరి 1: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. రామవరం గ్రామానికి చెందిన కొండేపూడి నవీన్, కల్యాణం చిన్న, సింగర్ల మహేష్‌బాబు స్థానిక ముమ్మిడివరపు నారయ్య సప్లయ్ కంపెనీలో పనిచేస్తున్నారు. కంపెనీలో జరిగే నూతన సంవత్సర వేడుకల కోసం నవీన్ మిగిలిన ఇద్దరితో కలిసి మోటారు సైకిల్‌పై జగ్గంపేటకు బిర్యానీ పార్శిల్ కోసం బయలుదేరారు. రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ ఢీ కొనడంతో వారు రోడ్డుపై పడ్డారు. నవీన్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఈ కేసును జగ్గంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



శీతాకాలం సోయగాలు

కడియం, జనవరి 1: శీతాకాలం వచ్చిందంటే చాలు కడియం నర్సరీల్లో రకరకాల సీజనల్ పుష్పాలు కనువిందు చేస్తాయి. ఈ కాలంలో చలి పెరిగే కొద్దీ మొక్కలు మరింత ఆకర్షణీయంగా పెరుగుతాయి. మొక్కలపై మక్కువ ఉన్న వన ప్రేమికులు ఈ కాలంలో సీజనల్ పుష్పాలు పెంచడానికే ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. బంతి, చామంతి, వింకారోజ్, డైజీ, డయాంతస్, జెనియా, పిటోనియా, డస్టిమిల్లర్, గజేనియా, క్రైసాంతిమం, స్ట్రాబెర్రీ, మినీడాలియా, సాల్వియా తదితర రకరకాల సీజనల్ పూలు శీతకాలంలో కనువిందు చేస్తాయి. కొద్దిపాటి జాగా ఉన్న ఇంటి పెరటిలోను, ఇంటిలోపల టీవీ, టీపాయ్ వంటి వాటిపైన, మరికొంత మంది హేంగింగ్ పాట్స్‌గాను ఈ మొక్కలను పెంచుతుంటారు. నర్సరీ రైతులు సెప్టెంబరులో ఈ సీజనల్ పుష్పాలు పెంచడం ప్రారంభిస్తారు. ఈ పుష్పాలు నవంబరు మాసం నుంచి ఫిబ్రవరి వరకు ఉంటాయి. ఈ సీజన్‌లోనే క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి, మహాశివరాత్రి వంటి పండుగలు రావడం, నర్సరీలను తిలకించేందుకు నర్సరీలకు సందర్శకుల తాకిడి ఉండటంతో ప్రతి నర్సరీలోను రైతులు సీజనల్ పుష్పాల పెంపకంపై దృష్టి సారిస్తారు.

రత్నగిరిపై చాగంటి ప్రత్యేక పూజలు



చాగంటి కోటేశ్వరరావుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

అన్నవరం, జనవరి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు, పండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించగా పీఆర్వో స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 25 వేల మంది దర్శించుకున్నారని అధికారులు చెప్పారు.

సిద్ధి వినాయకుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



పుష్పాలంకరణలో స్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న గిడుగు రుద్రరాజు

అయినవిల్లి, జనవరి 1: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. సోమవారం ఆంగ్ల సంవత్సరం ఆరంభం రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సిద్ధి వినాయకుని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు.

వారి కులంపై లోతుగా విచారణ జరపండి

- సహేతుక సమయంలో ఉత్తర్వులివ్వండి
- నిర్దిష్ట నిర్ణయం ఎందుకు చెప్పలేదు?
- దళితులకు శిరోముండనం కేసులో
- కలెక్టర్ తీరుపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): శిరోముండనం కేసులో బాధితులు కోటి చినరాజు, డి.వెంకటరమణ ఫలానా కులం వారని కలెక్టర్ నిర్దిష్ట నిర్ణయాన్ని వెల్లడించకపోవడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వారి కులం వ్యవహారంలో తాజాగా లోతైన విచారణ జరిపి చట్టనిబంధనల మేరకు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ చైర్మన్(జాయింట్ కలెక్టర్)ను ఆదేశించింది. బాధితుల కుల ధ్రువీకరణ పత్రం విషయంలో జిల్లా కలెక్టర్ 2019 జూన్ 11న జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. మరోసారి కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకునేందుకు బాధితులకు వెసులుబాటు కల్పించింది. వారి దరఖాస్తులపై సహేతుక సమయంలో నిర్ణయాన్ని వెల్లడించాలని జిల్లా కలెక్టర్, స్క్రూటినీ కమిటీకి స్పష్టం చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. దళిత యువకులకు శిరోముండనం చేసిన ఘటనలో తూర్పుగోదావరిజిల్లా ద్రాక్షారామ పోలీసులు 1997లో ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరికొందరిని నిందితులుగా పేర్కొన్నారు. అయితే బాధితులు కోటి చినరాజు, డి.వెంకటరమణ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు కాదని, తమ వాదనలు పరిగణలోకి తీసుకోకుండా 2019 జూన్ 11న జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని జీవరత్నం, మరో వ్యక్తి అదే ఏడాది జూన్ 25న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల ఇరు పక్షాలు తమ వాదనలు వినిపించాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. చట్టనిబంధనల ప్రకారం బాధితులు ఫలానా కులంవారని ఆమోదించడమో లేదా తిరస్కరించడమో నిర్దిష్ట నిర్ణయం వెల్లడించాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉందని గుర్తు చేశారు. బాధితుల కులధ్రువీకరణ ఉత్తర్వులను పరిశీలిస్తే.. యథాతథస్థితి పాటించాలని పేర్కొన్నారు తప్ప నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ ఉత్తర్వులకు చట్టబద్ధత లేదని, వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. బాధితుల కులం విషయంలో లోతైన విచారణ జరిపి చట్టనిబంధనల మేరకు సహేతుకమైన సమయంలో ఉత్తర్వులివ్వాలని నిర్దేశించారు.

రేపు అంతర్వేది ఫిషింగ్ హార్బర్‌కు కేంద్రమంత్రి రాక

- మత్స్యకారులతో సమావేశం
- కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్న
- కేంద్ర మంత్రి రూపాల పురషోత్తం

అంతర్వేది, జనవరి 1: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరుకు ఫిషరీస్, యానిమల్ హాస్బెండరీ, డైరింగ్‌శాఖ కేంద్ర మంత్రి రూపాల పురుషోత్తం బుధవారం విచ్చేస్తారు. మత్స్యకారులతో సమావేశమై కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ తెలిపారు. ఈ సదస్సుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎ.వేమా, జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహనరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు పాల్గొంటారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

స్నాతకోత్సవం నిర్వహణకు సన్నాహాలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

జేఎన్టీయూకే, జనవరి 1: కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. వర్సిటీ అకడమిక్, ఆడిట్ డైరెక్టర్, పీఆర్వో సీహెచ్ సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన విశ్వవిద్యాలయం 2024 నూతన క్యాలెండర్, డైరీ, న్యూస్ మ్యాగజైన్‌ల ఆవిష్కరణ కార్యక్రమంలో వీసీ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, డీఏపీ వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అందరి సమష్టి కృషి, సహకారంతో యూనివర్సిటీకి న్యాక్ ఏ+ గ్రేడ్, యూసీఈకే కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందన్నారు. క్యాంపస్‌లో చేపట్టిన రహదారులు, డ్రైన్లను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. యూసీఈకేలో బీటెక్ సీఎస్ఈ(ఏఐఎంఎల్) కోర్సు, ఎమ్మెస్సీలో డేటా సైన్స్ కోర్సు, ఎంబీఏలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రారంభించి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించామన్నారు. అనంతరం క్యాలెండర్, డైరీ, న్యూస్ మ్యాగజైన్‌లను వీసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తి నిర్బంధంపై వివాదం

పోలీసులపై టీడీపీ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం



పోలీసులను ప్రశ్నిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి, జనవరి 1: పోలీసుస్టేషన్‌లో వ్యక్తిని నిర్బందించడంపై వివాదం రాజుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పెదపూడి మండలం గండ్రేడుకు చెందిన వైసీపీ నాయకుడు పెంకే ఏకాశి అనే వీర వెంకట సత్యనారాయణ గండ్రేడు సెంటర్ వద్ద పలావు సెంటర్ నడుపుతున్నాడు. వైసీపీ విజయానికి అన్ని విధాల కృషి చేసిన పెంకే ఏకాశి పార్టీలో పూర్తిగా నష్టపోయి తగిన గుర్తింపు లేక తన అనుచరులతో భారీ ఎత్తున టీడీపీలో చేరుటకు రంగం సిద్ధం చేసుకున్నారు. విషయం తెలిసిన గండ్రేడు సర్పంచ్ కురుపూడి మాధవీలత భర్త శ్రీనివాస్ అనుచరుడు పిల్లి వెంకట్ గత నెల 31 మధ్యాహ్నం పలావు సెంటర్ వద్ద పెంకే ఏకాశితో ఘర్షణకు దిగాడు. అదే రోజు సాయంత్రం పిల్లి వెంకట్ పలావు సెంటర్ వద్దకు వెళ్లి పెంకే ఏకాశిపై దాడి చేయడంతో గాయపడిన ఏకాశి వైద్యం నిమిత్తం అదే రోజు రాత్రి 8.30 నిమిషాల సమయంలో కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లగా అక్కడ చికిత్స అనంతరం ఎమ్మెల్సీ నమోదు చేశారు. విచారణ నిమిత్తం పెంకే ఏకాశిని పెదపూడి పోలీసులు స్టేషన్‌కు పిలిచి అక్కడ ఉంచారు. వైసీపీ నుంచి వెళ్లిపోతున్నాడనే కక్షతో అధికార పార్టీ నాయకులు ఒత్తిడి మేరకు ఎంతకూ పోలీసులు తనను విడుదల చేయకపోవడంతో విషయాన్ని పెంకే ఏకాశి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి తెలిపారు. విషయం తెలుసుకున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఉదయం నుండి ఏకాశిని ఎందుకు నిర్బంధించారని ప్రశ్నించారు. గొడవపడ్డ ఇరుపార్టీలను స్టేషన్‌కు పిలిపించాలి కానీ ఒక్కరినే స్టేషన్‌కు పిలిచి నిర్బంధించడం ఏమిటని, నూతన సంవత్సరం సందర్భంగా అధికారులు అందుబాటులో ఉండరని తెలిసిన సమయంలో ఎందుకు ఏకాశిని స్టేషన్‌కు పిలిపించారని పోలీసులపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒత్తిళ్లకు తలొగ్గి విధులు నిర్వహిస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. అప్పుడు ఒత్తిడి తెచ్చిన వారు మిమ్మల్ని ఆదుకోలేరన్నారు. సాక్షాత్తు నల్లమిల్లే పూచీకత్తు ఇస్తాననడంతో ఏకాశిని పోలీసులు విడుదల చేయడంతో వివాదం సద్దుమణిగింది.

లారీ ఢీకొని యువకుడి మృతి



తునిరూరల్, జనవరి 1: కాకినాడ జిల్లా తుని పట్టణంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. తుని సీతారామపురానికి చెందిన పి.గణేష్ (28) పెట్రోల్ పోయించుకుని ఇంటికి వెళుతుండగా పట్టణంలోని ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై తుని పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వైద్య విద్యార్థులకు తీవ్రగాయాలు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 1: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) చేస్తున్న ఇద్దరు వైద్య విద్యార్థులు సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. తమిళనాడుకు చెందిన 30 ఏళ్ల డా.అరుల్, 30 ఏళ్ల డా.అనుసత్య షణ్ముఖ సుందరన్ ఆర్ఎంసీలోని ఈఎన్‌టీ విభాగంలో మొదటి సంవత్సరం పీజీ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వారిద్దరు జీజీహెచ్‌కు ఎదురుగా ఉన్న పీజీ హాస్టల్‌లో ఉంటూ చదువులో భాగంగా జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి హాస్టల్ నుంచి విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై జీజీహెచ్‌కు వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా మెయిన్ రోడ్డు వైపు నుంచి జిల్లా పరిషత్ వైపు వేగంగా వెళుతున్న మరో బైక్ వీరి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దాంతో వైద్య విద్యార్థులు ఇరువురు చెల్లా చెదురుగా పడి తీవ్రంగా గాయపడ్డారు. అది గమనించిన స్థానికులు క్షతగాత్రులను అత్యవసర విభాగానికి తరలించగా అక్కడ వైద్యులు పలు వైద్య పరీక్షలు నిర్వర్తించి వైద్య చికిత్సను అందజేస్తున్నారు. అరుల్‌కు ఎడమ మోకాలు భాగం విరిగి, పాదం భాగం లో కన్నం పడి తీవ్ర రక్తస్రావం అయింది. అలాగే అనుసత్యకు ముఖం భాగంలో తీవ్ర గాయాలు అవడంతో ఈఎన్‌టీ వైద్యులు ప్రత్యేక వైద్య చికిత్సను అందజేస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



నన్నయ వర్సిటీలో నూతన సంవత్సరం డైరీ ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు

ఏజెన్సీ సమాచారం

ఏజెన్సీలో న్యూఇయర్ వేడుకలు



పీవోకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉద్యోగులు

రంపచోడవరం, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలను ఏజెన్సీలో ఘనంగా నిర్వహించారు. ఐటీడీఏ కార్యాలయంలో పీవో సూరజ్ గనోరేను వివిధ శాఖల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పీవో కేక్ కటింగ్ చేశారు. పీవో మాట్లాడుతూ ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో నెట్వర్క్ సేవలను అందించి తద్వారా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా కృషి చేయనున్నట్లు చెప్పారు. సబ్ కలెక్టర్ నివాస ప్రాంగణంలో సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌ను వివిధ శాఖల అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఏజెన్సీలో రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో(జీ) సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్డీసీలు జాన్‌రాజ్, డీఎస్ శాస్త్రీ, ఐటీడీఏ ఏవో రమణ, జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, ఏపీడీ శ్రీనివాసరావు, ఈఈలు డేవిడ్‌రాజ్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కె.దేవేంద్రుడు, సుబ్బయ్య, రవి, తహశీల్దార్లు పీవీవీ జయకుమార్, కె.శ్రీనివాసరావు, శ్రీమన్నారాయణ, సత్యనారాయణ, తాతారావు, సుబ్రహ్మణ్యం, పీఏవో రాంబాబు పాల్గొన్నారు.

సీలేరు కాంప్లెక్స్ ఆఫీస్‌లో వేడుకలు



శుభాకాంక్షలు చెబుతున్న వేగి

మోతుగూడెం, జనవరి 1: చింతూరు మండలం మోతుగూడెంలో సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో సోమవారం చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ కేక్ కట్ చేసి ఏపీ జెన్కో కార్మికుల అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, డీఈటీ వరప్రసాద్, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ ఎ.ప్రసాద్, ఏఎస్ నాగేశ్వరరావు, కార్మిక సంఘాలు, కాంట్రాక్ట్ కార్మికులు, కాంట్రాక్టర్లు, ప్రజా ప్రతినిధులు మోతుగూడెం ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, నగర ప్రముఖులు, పలువురు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నూతన సంవత్సరానికి ఘన స్వాగతం

వరరామచంద్రపురం, జనవరి 1: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటి ముందు రంగురంగుల ముగ్గులతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. రాత్రి 12 గంటలకు కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు, నాయకుల ఇళ్ల వద్ద సందడి వాతావరణం కనిపించింది.

అయోధ్య శ్రీరాముడి అక్షింతలు పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

రంపచోడవరం, జనవరి 1: విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, సమరసత సేవా ఫౌండేషన్ కార్యకర్తలు , కోదండ రామాలయం ఆలయ కమిటీ సభ్యులు సోమవారం గ్రామంలో ఇంటింటికి వెళ్లి అయోధ్య శ్రీరాముని పూజిత అక్షింతలు, రామమందిర పటం, ఆహ్వాన పత్రం పంపిణీ చేసినట్లు ధర్మ ప్రచార సేవా భక్త మండలి కోఆర్డినేటర్ నల్లమిల్లి వెంకటరామారెడ్డి తెలిపారు.

యాప్‌ల పనిభారం తగ్గించాలి

విలేకరులతో ముఖాముఖిలో యూటీఎఫ్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మనోహర్‌కుమార్

నల్లజర్ల, జనవరి 1: ఉపాధ్యాయులకు యాప్‌ల పని భారం తగ్గించి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్‌కుమార్ పేర్కొన్నారు. నల్లజర్ల హైస్కూల్లో యూటీఎఫ్ నాయకులు సోమవారం స్థానిక విలేకర్లతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుని చదువుకునేందుకు యూటీఎఫ్ మోడల్ పేపర్‌ను ముద్రించి అన్ని సబ్జెక్ట్స్ రూ.75కే అందించిందన్నారు. గత పరీక్షల్లో ఈ మోడల్ పేపర్‌లో ప్రశ్నలు అధికంగా రావడం వల్ల ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి వ్యతిరేకంగా ప్రభుత్వం సాగిస్తున్న విధానాలను మానుకోవాలని, పీఆర్‌సీ రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. పీఎఫ్ సొమ్ములను ఖాతాలో జమ చేయాలన్నారు. మండల కార్యదర్శి బండి కిషోర్, పల్లి వెంకటఅప్పారావు, ఏసుదాసు, ఎల్.నాగరాజు పాల్గొన్నారు.

రేపు సర్పంచ్‌ల రాష్ట్రస్థాయి సమావేశం

దేవరపల్లి, జనవరి 1: గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు సర్పంచ్‌ల రాష్ట్రస్థాయి సమావేశం జరుగుతుందని, దీనికి పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలోని సర్పంచ్‌లు హాజరు కావాలని సర్పంచ్‌ల చాంబర్ నియోజకవర్గ అధ్యక్షురాలు కరుటూరి ఉషారాణి పిలుపునిచ్చారు. రాష్ట్ర పంచాయతీ చాంబర్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు టీడీపీ అధినేత చంద్రబాబు హాజరవుతారని, అన్ని పార్టీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

దళితుల ఆత్మగౌరవ పోరాటాలు బలోపేతం కావాలి

నిడదవోలు, జనవరి 1: దళితుల ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటాలను బలోపేతం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు అన్నారు. సోమవారం మండలంలోని సమిశ్రగూడెంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్ర హం వద్ద దళిత మృతులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1818 జనవరి 1న భీమానది ఒడ్డున భీమా కోరేగావ్ గ్రామంలో బ్రిటీష్ ఈస్టిండియా సైన్యానికి మరాఠ సమాఖ్యకు చెందిన పీష్వా సైన్యానికి జరి గిన పోరాటంలో ఎందరో దళితులు మృతి చెందారన్నారు. వారందరికీ నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రతాప్, శశికుమార్, రాజు, సతీష్, కృష్ణ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో ఆదిరెడ్డి అప్పారావు, వాసులకు నాయకుల శుభాకాంక్షలు



కడియం: సత్యనారాయణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సరీసంఘం



అనపర్తి: రామవరంలో రామకృష్ణారెడ్డికి శుభాకంక్షలు చెబుతున్న తెలుగు మహిళలు

హ్యాపీ న్యూఇయర్

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- పలుచోట్ల కేక్ కట్ చేసి సంబరాలు
- నాయకులు, అధికారులకు పలువురి శుభాకాంక్షలు
- ఆలయాలకు క్యూకట్టిన భక్తులు.. ప్రత్యేక పూజలు

రాజానగరం/గోకవరం, జనవరి 1: నూతన సంవత్సరానికి ప్రజలు ఘనంగా స్వాగ తం పలికారు. పలుచోట్ల వేడుకలు అంబరాన్నంటాయి. బాణ సంచా కాల్చి, కేకులు కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. 31వ తేదీ ఆదివారం రావడంతో యువత ఉరకలేసే ఉత్సాహంతో స్నేహితులతో కలిసి వేడుకలను ఆనందంగా జరుపుకున్నారు. ఏ గ్రామంలో చూసినా బిర్యానీ విక్రయాల జోరుగా సాగాయి. పాయింట్లు పుట్టగొడులా పుట్టుకొచ్చాయి. మరి కొన్నిచోట్ల కూల్‌డ్రింకుల ఆఫర్లతో బిర్యానీ ప్రియులను ఆకట్టుకున్నారు. గత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ నూతన ఏడాదికి స్వాగతం పలుకుతూ గ్రామాల్లో వీధులన్నీ ఆకర్షణీ యమైన రంగులతో ముగ్గులను యువత అందంగా తీర్చిదిద్దారు. సోమవారం ఉదయం భక్తులు పలు ఆలయాలకు క్యూకట్టారు. భగవంతుని దర్శించుకుని కొత్త సంవత్సరంలో అంతా మంచే జరగాలని వేడుకున్నారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొన్ని చర్చిల్లో సంఘస్థులకు వాగ్దానాల కార్డులను అందజేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రముఖ నేపథ్య గాయని మంగ్లీ గైట్ ఇంజనీరింగ్ కళాశాలను సోమవారం రాత్రి సంద ర్శించారు. ఆమెతో సెల్ఫీలు, ఫొటోలు తీసుకునేందుకు విద్యార్థులు ఎగబడ్డారు. అనంతరం మంగ్లీ మాట్లాడుతూ తల్లిదండ్రులను మించిన దైవం లేదని, వాళ్లు ఎంతో కష్టించి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తారన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్లను మంచికే వాడాలని, చెడుగా వినియోగించవద్దని సూచించారు. కార్యక్రమంలో చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడకు కేవీవీ సత్యనారాయణ రాజు (చైతన్యరాజు), డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పీఎంఎస్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లీలావతి తదితరులు పాల్గొన్నారు.

కడియం: మండలంలో గణపతి, శివపార్వతుల ఆలయాలతోపాటు పలు ఆలయాలకు భక్తులు క్యూకట్టారు. అలాగే ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, వైస్ ఎంపీపీలు పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి, సర్పంచ్‌లు అన్నందేవుల చంటి, బత్తుల నళినిజయంతి, ముద్రగడ సత్యస్వరూప, యాదల స్టాలిన్, చెక్కపల్లి మురళి, కొత్తపల్లి సత్యవతి, సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీలను ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సరీమెన్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, సభ్యుడు మార్గాని సత్యనారాయణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలానే నర్సరీ సంఘం కలెక్టర్ మాధవీలత, తహశీల్దారు ఎం.సుజాత, ఎంపీడీవో రత్నకుమారి, సీఐ తిలక్ తోపాటు టీడీపీ, జనసేన, వైసీపీ నాయకులను కలిసి శుభాకాంక్షలు తెలిపింది.

అనపర్తి: మండలంలోని రామవరంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డికి పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలతో వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు మహిళలు ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిరస పల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, జుత్తుగ కృష్ణ, వేణుగోపాలరెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, పోతంశెట్టి సుభాషిణి, బేరా వేణమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు. రామకృష్ణారెడ్డి.. యనమల రామకృష్ణుడిని, మాజీ హోం మంత్రి చినరాజప్పను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనపర్తిలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి పలువురు అధికారులు, నాయకులు, వలంటీర్లు, సచివాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎంఎం బాలకృష్ణారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కోరుకొండ: నూతన సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, పండితులు కోరుకొండ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ అనువంశిక కర్త పరాసర రంగరాజభట్టర్ ఆధ్వర్యంలో పలువురు అర్చకులు, అధ్యాపక స్వాములు నరసన్న సన్నిధిలో గోదాదేవికి తిరుప్పావై గోష్ఠి నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి, కోదండ రామాలయం, పశ్చిమగోనగూడెంలో గీత మిషన్ వద్ద తిరుప్పావై పారాయణం నిర్వహించారు. హరేరామ సమాజం వద్ద మిరియాల వెంకటశేష త్రిమూర్తుల సత్యవతి ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామపారాయణం, తిరుప్పావై గోష్ఠి నిర్వహించారు. అన్నపూర్ణ కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పంచామృత అభిషేకాలు జరిగాయి. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలంటూ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రత్యేక హోమం నిర్వహించారు. జక్కంపూడి విజయలక్ష్మి, ఎమ్మెల్యే సతీమణి రాజేశ్వరి, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, నాగా రమేష్, తిక్కిరెడ్డి దుర్గాభాస్కర్ పాల్గొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులకు జనసేన, టీడీపీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ కార్యాలయం వద్ద నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరికి నాయకులు, కార్యకర్తలు, శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రులు యనమల రామకృష్ణ, నిమ్మకాయల చినరాజప్ప, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూలను మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మార్పు రావాలని.. చంద్రబాబు సీఎం కావాలని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆకాంక్షించారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో వారిద్దరినీ పలువురు నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ నూతన ఏడాదిలో ప్రజలంతా సుఖ సంతోషలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. నాలుగున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం చేసిందేమిలేదన్నారు. రాబోయే వంద రోజుల పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిని, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణను వారి నివాసాల్లో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ భరత్‌రామ్‌ను తన కార్యాలయంలో పలువురు ఉన్నతాధికారులు, పార్టీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నివాసంలో అభిమానులు, కార్యకర్తలు నాయకుల సమక్షంలో ఆయన న్యూఇయర్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం కుటుంబంతో కలిసి హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నూతన సంవత్సరంలో మరింత అభివృద్ధి

నన్నయ వర్సిటీ ఉపకులపతి పద్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 1: ప్రస్తుత సంవత్సరంలో నూతన భవనాల నిర్మాణం, కొత్తకోర్సులు ప్రవేశపెట్టడంతో బాటు నూతన పోస్టులు తీసుకురావడం వంటి లక్ష్యాలతో పనిచేస్తున్నట్టు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను సోమవారం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నయ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం యూనివర్సిటీ డైరీని, క్యాలెండర్‌ను వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవనాల నిర్మాణం పూర్తయిన తరువాత నూతన కోర్సులు ప్రవేశపెడతామన్నారు. స్థానిక క్యాంపస్‌లో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ ఈ ఏడాది అందుబాటులోకి తెస్తామన్నారు. అలాగే కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో చేస్తున్న ప్రతిపాదనలను, సమకూర్చుతున్న వసతులను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధికార్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. నన్నయ ప్రాంగణంలోని కళాశాలల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలతో వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.



కోరుకొండలో బీవీఆర్ చౌదరికి నాయకుల శుభాకాంక్షలు



కోరుకొండలో బలరామకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



శివరామసుబ్రహ్మణ్యం దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

కనీస వేతనం ఇవ్వాలి

- మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు

కొవ్వూరు, జనవరి 1: కరోనా సమయంలో కాళ్లు కడగడం కాదు, తమ కుటుంబాలను పోషించుకోవడానికి కనీస వేతనం అందజేయాలని మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 7వ రోజు కొనసాగింది. నూతన సంవత్సరం సందర్భంగా సమ్మె శిబిరం వద్ద కేక్ కట్‌చేసి నాయకులు, అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మిక సంఘం నాయకుడు రాజాన అప్పారావు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం అంటున్నారని, మరి గడప గడపలో చెత్తనెత్తే తమను మర్చి పోతే ఎలా అని నిలదీశారు. ఆప్కాస్‌లో చేర్చి చేతులు దులుపుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికయినా పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఔట్‌సో ర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్ర మంలో పూజారి వాసు, భూపతి రవీంద్ర, కళ్యాణి రాజేష్, మీసాల ప్రేమ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు పాల్గొన్నారు.



కొవ్వూరులో సమ్మె చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

అవగాహన సదస్సుకు రాజకీయ రంగులా!

కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు భారతి

కొవ్వూరు, జనవరి 1: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై న్యాయవాదుల సంఘం నిర్వహించిన అవగాహన సదస్సుకు రాజకీయ రంగులు పులమడం సరికాదని కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతి అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలంతా సిరాస్థులు కలిగిన రైతులేనని, భూహక్కు చట్టంతో కలిగే దుష్పరిణామాలు వివరించడం న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలిగా తన బాధ్యత అన్నారు. ప్రాసిక్యూటర్‌గా నిష్పక్షపాతంగా బాధితులకు అండగా, బాధ్యతాయుతంగా పాలకపక్షం గౌరవం ఇనుమడించే విధంగానే తాను పనిచేశానన్నారు. నాయకుడిగా తన భర్త శంకరం ఎటువంటి రాజకీయ పైరవీలు చేయలేదన్నారు. తాళ్లపూడి మండలం మలకపల్లిలో న్యాయవాదుల సంఘం తరపున చేపట్టిన అవగాహనా సదస్సును సాకుగా తీసుకుని పార్టీలో అంతర్గత కలహాలను రెచ్చగొట్టడం పార్టీకి నష్టమే తప్ప, ఏ రకంగాను లాభం చేకూదని వైసీపీ నాయకులు గుర్తించాలన్నారు. వీలైతే భూహక్కు చట్టంపై న్యాయవాదులతో చర్చకు సిద్ధం కావాలన్నారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

అనపర్తి, జనవరి 1: అనపర్తిలో శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఎనిమిది రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2న శ్రీనివాస కల్యాణం హరికథతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 3న శ్రీరామ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం, 4,5,6 తేదీల్లో పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాలు, 7న వేద పఠనం, స్వర లయ సుధ వాద్య సమ్మేళనం, 8న గాత్ర కచేరి, 9న కూచిపూడి భరతనాట్యం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

అటవీ ఉద్యోగులకు శిక్షణ ఎంతో ముఖ్యం

అటవీ అకాడమీ డైరెక్టర్ ఉదయభాస్కర్



శిక్షణ పొందుతున్న అటవీ ఉద్యోగికి కిట్ అందజేస్తున్న ఉదయభాస్కర్

దివాన్‌చెరువు, జనవరి1: అటవీశాఖ ఉద్యోగులకు శిక్షణ ఎంతో ముఖ్యమని దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ శిక్షణా సంస్థ డైరెక్టర్ పీవీ ఉదయ భాస్కర్ అన్నారు. అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న 54 మంది ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలకు శిక్షణా కార్యక్రమానికి అవసరమైన సామగ్రితో కూడిన కిట్‌ను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అటవీ అకాడమీకి సొంత భవనం నిర్మాణానికి రూ.30 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని చెప్పారు. దీనికి ఆమోదం లభించగానే పనులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి దామోదర్, ఫ్యాకల్టీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభాస్ అభిమానుల సంబరాలు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1: ప్రభాస్ నటించిన సలార్ సినిమా వసూళ్ల సునామీ సృష్టిస్తున్న సందర్భంగా స్థానిక అశోక థియేటర్‌లో సోమవారం రాజమండ్రి ప్రభాస్ ఫ్యాన్స్ కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. థియేటర్ యాజమాన్యానికి, డిస్ట్రిబ్యూటర్లకు స్వీట్లు పంచారు. కార్యక్రమంలో అసోసియేషన్ సిటీ గౌరవాధ్యక్షుడు డి.మురళీకృష్ణ, రాజమండ్రి సిటీ అధ్యక్షుడు శివప్రసాద్, సిటీ ఉపాధ్యక్షుడు వైదేవి ప్రసాద్ పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



అక్షింతలను పంపిణీ చేస్తున్న సమరసత ఫౌండేషన్ సభ్యులు

సీతానగరం, జనవరి 1: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ నుంచి వచ్చిన శ్రీరాముని దివ్య అక్షింతలను మండలంలోని సీతానగరం, పురుషోత్తపట్నం గ్రామాల్లో రామాలయ కమిటీ సభ్యులు భక్తులకు అందజేశారు. సోమవారం సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలతో పాటు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ సభ్యులు అద్దె మల్లేశ్వరరావు, కొణపల అభిలాష, శ్రీవిద్య, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

వృద్ధులకు చీరలు పంపిణీ



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1: రాజమహేంద్రవరం వీటీ డిగ్రీ కళాశాల ఆనంద గార్డెన్స్‌లో సోమవారం వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు స్వీట్లు, చీరలు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరంలోని ఎస్ఎస్ మాల్ అధినేత బీఎస్‌డీ బీఎస్ సింగ్ దంపతులు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం క్లబ్‌లోని వృద్ధులకు చీరలు పంచారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు, కార్యదర్శి గుబ్బల గంగాభవాని, క్లబ్ వ్యవస్థాపకుడు పామర్తి గోపాలరావు, సూరపురెడ్డి తాతారావు, సభ్యులు.. దాతలను సత్కరించారు.

టీడీపీలో చేరిన సోమన్నచౌదరి



సోమన్నచౌదరిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న రామకృష్ణారెడ్డి

రంగంపేట, జనవరి 1: మండల సాగునీటి కన్వీనర్, మర్రిపూడికి చెందిన పుట్టా సోమన్నచౌదరి సోమవారం గ్రామ కమిటీ అధ్యక్షుడు పుట్టా వెంకటేష్, సీనియర్ నాయకుడు మోదుకూరి సత్తిరాజు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆయనకు రామవరంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా సోమన్నచౌదరి 1983 నుంచి టీడీపీలో కొనసాగుతూ 2019లో స్థానిక నాయకులతో స్వల్ప విభేదాల వల్ల వైసీపీలో చేరారు. మెట్ట ప్రాంత అభివృద్ధిని కోరుకునే ఒక రైతుగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆగిపోవడంతో నిరాశకు గురై టీడీపీలో చేరినట్టు సోమన్నచౌదరి తెలిపారు.

నేటి నుంచి 'ఆరోగ్య సురక్ష'

రాజానగరం, జనవరి 1: మండలంలో ఈ నెల 2వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనిలో భాగంగా 2న దివాన్‌చెరువు గ్రామ సచివాలయం-1లో తొలిరోజు క్యాంపు జరుగుతుందన్నారు. దీనిపై ఇప్పటికే ఇంటింటి సర్వే నిర్వహించి కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయాలు తెలుసుకుని క్యాంపు జరిగే తేదీని ప్రజాప్రతినిధులకు తెలియజేశామన్నారు. ఈ శిబిరాల్లో అన్ని రకాలైన పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని సంబంధిత రిఫరల్ ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారన్నారు. మండలంలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	:	సలార్
సూర్యామినీ	:	ఆక్వామేన్
సూర్యాప్యాలస్	:	సలార్
స్వామి	:	హాయ్ నాన్న
శివజ్యోతి	:	ఉమాపతి
అనుశ్రీ(సాయికృష్ణ)	:	డెవిల్
రాజా	:	సలార్
అశోక	:	సలార్
ఊర్వశి	:	డెవిల్
రంభ	:	బబుల్‌గమ్
మేనక	:	ఆక్వామేన్
అప్సర	:	యానిమల్
వీఎస్ మహల్ (నామవరం)	:	సలార్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	:	డెవిల్
వెంకటసూర్య(కడియం)	:	సలార్
సత్యగౌరి (అనపర్తి)	:	సలార్
సూర్యశ్రీ (అనపర్తి)	:	డెవిల్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	:	సలార్
రామకృష్ణ(కోరుకొండ)	:	డెవిల్
గీతాసినిమాస్ (సీతానగరం)	:	హాయ్ నాన్న
శ్రీనివాస (గోకవరం)	:	డెవిల్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	:	సలార్
లలితామహల్(రంపచోడవరం)	:	సలార్
నవయుగ(చింతూరు)	:	సలార్



నూతన సంవత్సర శుభాకాంక్షలతో కడియపులంక సత్యదేవా నర్సరీలో 60 వేల మొక్కలతో అలంకరించిన అయోధ్య రామమందిరం నిర్మాణ ప్రతీక.. కడియపులంకలో పుష్పగుచ్ఛాలు





తాగారు.. ఊగారు!

- మత్తులో నూతనోత్సాహం
- మూడు రెట్లు పెరిగిన అమ్మకాలు
- రెండు రోజుల్లో రూ.15 కోట్లు
- 1 గంట వరకే అనుమతులు
- తెల్లవార్లూ అమ్మకాలే
- మరో వైపు విచ్చలవిడిగా సారా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తాగండిరా.. ఊగండిరా.. అని సర్కారు ఆదేశిస్తే మందుబాబులు ఊరుకుంటారా..! ఫుల్‌గా లాగించే శా రు..జేబులు గుల్ల చేసుకున్నారు.. 2023 పోకడ.. 2024 రాకడ సందర్భంగా జిల్లాలోని మందుబాబులు మందులో ఈతకొట్టారంటే అతిశయోక్తి కాదేమో.. అంతలా మందులో మునిగి తేలారు. దీంతో రెండు రోజుల్లో జిల్లాలో మద్యం అమ్మకాలు 300 శాతం పెరిగాయి. మద్యం ఆదాయంతోనే నడుస్తున్న ప్రభుత్వం ఈ రెండు రోజుల్లో సాధ్యమైనంత ఎక్కువగా మందు జనాల గొంతు దిగాలని ఆదేశించడంతో సుమారు వారం నుంచే కసరత్తు చేసి అధికారులు స్టాకు తగ్గకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ఓ వైపు ప్రభుత్వ మద్యం.. మరోవైపు పూటుగా సారా ఫుల్‌గా పట్టేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.

రెండు రోజుల్లో రూ.15 కోట్లు

నూతన సంవత్సరం రాక సందర్భంగా డిసెంబరు 31, జనవరి 1న ప్రభుత్వ మద్యం దుకాణాలు, వాకిన్ స్టోర్లు(టూరిజం అవుట్‌లెట్లు) అర్ధరాత్రి 12 గంటల వరకూ.. బార్లు మరో గంట ఎక్కువగా ఒంటిగంట వరకూ తెరిచి తాగించడంటూ ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఇది ఆసరాగా తీసుకొని దాదాపుగా తెల్లార్లూ మద్యం అమ్మకాలు సాగించారు. బీర్లు పొంగి పొర్లాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు బాగానే గిట్టుబాటైంది. ఈ రెండు రోజుల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లు, బెల్టుషాపులు అన్నీ కలుపుకొని రూ.15 కోట్ల వరకూ మందుబాబుల జేబులకు చిల్లుపడింది. రాజమండ్రి డిపో పరిధిలోని రామచంద్రాపురం, మండపేట, ఆలమూరు, రాజమండ్రి రూరల్, అర్బన్, గోకవరం, కోరుకొండ, చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్‌పురం రంపచోడవరం, రాజానగరం, కడియం, సీతానగరం, అనపర్తి మండలాల్లోని సుమారు 90 మద్యం దుకాణాలు 8 వాకిన్ స్టోర్లు, 25 బార్లు ఉన్నాయి. ఆయా దుకాణాల్లో డిసెంబరు 31న రూ.6 కోట్లు, జనవరి 1న రూ.4 కోట్ల అమ్మకాలు నమోదయ్యాయి. జిల్లాలోని రెండు డిపోల్లో చాగల్లు ఒకటి. కానీ ఈ డిపో ఆదాయం ఏలూరు జిల్లా పరిధిలోకి వస్తుంది. కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లోని 9 మండలాల అమ్మకాలు కూడా తూర్పులో కలుపుకుంటే రెండు రోజుల్లో రూ.4కోట్లు ఉండే అవకాశం ఉంది. మిగతా సొమ్ము సారా తాగినవాళ్ల ముట్ట జెప్పింది. సాధారణ రోజుల్లో రాజమండ్రి డిపో పరిధిలో రోజుకు రూ.2 కోట్ల మేర అమ్మకాలు నమోదవుతున్నాయి. కానీ డిసెంబరు 31న ఒక్కరోజే రూ.6కోట్ల రాబడి కనిపించింది.

జగనా.. ఇదేం మోసం?

గత నాలుగున్నరేళ్ల నుంచీ నకిలీ బ్రాండ్లు, నాణ్యత లేని సరుకుతో మద్యపానప్రియులు ఇబ్బంది పడుతున్నారు. మంచి మందు కోసం కటకటలాడుతున్నారు. సాధారణ రోజుల్లో బార్లలో దొరికే బ్రాండ్లలో చాలామటుకు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో దొరకడం లేదు. ఉదాహరణకు ఎలిఫేంట్ బీరు బార్ల దగ్గర బోర్డులు ఏర్పాటు చేసి మరీ అమ్ముతున్నా.. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మాత్రం కింగ్‌ఫిషర్ బీరు కూడా దొరకదు. బ్రాండ్ల పరిస్థితీ అంతే బార్లలో దొరికే వాటిలో సగం బ్రాండ్లు కూడా ప్రభుత్వ మద్యం దుకాణాల్లో లభ్యం కావు. కానీ.. పండుగలు, ప్రత్యేక దినాల్లో మాత్రం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కూడా సరుకు ఫుల్లుగా ఉండే విధంగా ప్రభుత్వం శ్రద్ధ చూపుతోంది. కొద్ది రోజుల ముందు నుంచే ప్రణాళిక వేసుకొని అధికారులను సన్నద్ధం చేసి అమ్మకాలు సాగిస్తోంది. ఇలా ప్రభుత్వం మద్యం, నాటుసారా పూటుగా అందుబాటులో ఉంచడంపై మహిళలు మండిపడుతున్నారు. మద్యం దుకాణాల సంఖ్య తగ్గించమంటే ఫుల్లుగా తాగించడమా? అని పాలకులను ప్రశ్నిస్తున్నారు.

నూతన సంద..డే!

ఊరూ వాడా నూతనోత్సాహం

ఉత్సాహం ఉరకలెత్తింది.. కొత్త ఏడాది ఆనందం తెచ్చింది.. ఉదయం నుంచీ సందడే.. సందడి.. నాయకుల ఇళ్ల వద్ద అభిమానులు క్యూకట్టారు.. కళాశాలలు.. పాఠశాలల్లో విద్యార్థులు లైన్ కట్టారు.. ఇళ్ల వద్ద మహిళలు ఆనందం పంచుకున్నారు.. ఎవరి నోటా విన్నా ఒకటే మాట.. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ అందరికీ శుభాకాంక్షలు చెప్పుకుంటూనే ఉన్నారు.. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుంటూ సోమ వారం తెల్లవారుజాము నుంచే సందడి చేశారు. కొత్త ఆశలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు.. ఈ సందడిలో అందరి నోటా వినిపించిన మాట ఒక్కటే.. ఈ ఏడాది మారాలి.. మారాలంటే.. మార్పు మనతోనే ఆరంభం కావాలి.. ఎవరిని ఎన్నుకోవాలో.. ఎలా బతకాలో.. ఎలా గెలవాలో నిర్ణయించుకోవాల్సిందే మీరే.. అందునా ఈ ఏడాది మరీ ప్రత్యేకం.. ఎందుకంటే ఎన్నికల సంవత్సరం.. మన భవిష్యత్ మన చేతుల్లోనే ఉంది..



ఆదిరెడ్డి వాసుకు శుభాకాంక్షలు

- గుడ్ బై 2023.. వెల్‌కమ్ 2024
- ఆనందంగా స్వాగతించిన జనం
- నాయకుల ఇళ్ల వద్ద భారీ క్యూ
- కలెక్టరేట్‌లో ప్రత్యేక వేడుక
- కిటకిటలాడిన ఆలయాలు, చర్చిలు
- ఈ ఏడాదే రాజకీయ కాక

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కొత్త ఆశలు.. ఆశయాలు.. ఆకాంక్షలతో ఈ ఏడాది క్యాలెండర్ మొదలైపోయింది. మహిళల రంగవల్లికల సవ్వడి.. యువత కేరింతలు.. విద్యుత్ దీపాలంకరణలు.. కేక్ కటింగ్‌లు.. స్వీట్ల ప్యాకెట్లు.. మందుబాబుల సందడి నడుమ 2024 వచ్చేసింది. 2023కి ఆవేదనగా వీడ్కోలు చెబుతూ.. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సంబురాలు అంబరాన్నంటాయి. డిసెంబరు 31న సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలు దాటిన మరుక్షణం బాణాసంచా వెలుగులు వెల్లివిరిశాయి. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ కేకలు కెవ్వుమనిపించాయి. ఆ శుభాకాంక్షలతో నూతన సంవత్సరం పరవశించిపోయింది. జనాలు వీధుల్లోకి వచ్చి 2024ని స్వాగతించారు. దేవాలయాలు కళకళలాడాయి. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవాలయాల్లో తెల్లవారుజామునుంచే భక్తుల సందడి మొదలైంది. ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. 1న కూడా చర్చిలు, దేవాలయాల్లో వేడుకలు చేసుకున్నారు. కలెక్టర్ నివాసాన్ని, ప్రవేశ ద్వారాన్ని పూల మాలలతో అందంగా అలంకరించారు. కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల ఇళ్ల, కార్యాలయాల వద్ద పళ్ల, స్వీట్లు, పూలగుచ్ఛాలతో ప్రభుత్వ సిబ్బంది, ప్రజలు క్యూకట్టారు. జిల్లా బాస్‌లు ఇద్దరూ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కడియంలోని నర్సరీ యజమానులు రంగురంగుల పూలు, మొక్కల ఆకర్షణీయ కూర్పుతో కొత్త ఏడాదికి స్వాగతం చెప్పారు. ఎస్పీ జగదీశ్ స్వీయ పర్యవేక్షణలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా శాంతిభద్రతలకు కావలి కాశారు. ఏదేమైనా.. వడివడిగా వచ్చేసిన 2024లో మొదటిరోజు ఆనందంగా వచ్చి.. సందడిగా పలకరించి వెళ్లింది.

నాయకుల ఇళ్ల వద్ద క్యూ

ఇది పొలిటికల్ ఇయర్. సాధారణ జనానికి ఇది న్యూయర్ కావచ్చు.కానీ రాజకీయనేతలకు అత్యంత ముఖ్యమైన న్యూఇయర్. ఇక 100 రోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన,వైసీపీ తదితర నేతలందరి ఇళ్ల వద్ద సందడి నెలకొంది. పార్టీకార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖల ఉద్యోగులు, అధికారులు భారీగా తరలివచ్చారు. వచ్చిన వారినందరినీ ప్రేమతో పలకరించి నేతలు ఫొటోలు దిగారు. రాజమహేంద్రవరంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఇళ్ల వద్ద జనం క్యూ కట్టారు. రూరల్ నుంచి వేలాదిమంది కార్యకర్తలు, నేతలు తరలివచ్చిన గోరంట్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి అభిమానులు వచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై గోరంట్ల నాయకత్వం వర్ధిల్లాలని నినాదాలు చేశారు. అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ ఇంటి వద్ద కూడా ఉదయం నుంచే అభిమానులు, పార్టీ కార్యకర్తల సందడి నెలకొంది. చంద్రబాబును మళ్లీ సీఎం చేయడానికి, ప్రజలంతా కొత్త నిర్ణయం తీసుకోవాలని యువనేత ఆదిరెడ్డి వాసు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు పిలుపు ఇచ్చారు. సిటీ నుంచి మాజీ కార్పొరేటర్లు అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.గుడా మాజీ ఛైర్మన్ గన్నికృష్ణ ఇంటి వద్ద అభిమానులతో సందడి నెలకొంది. జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల దుర్గేష్ తన సతీమణి అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఆసుపత్రిలో ఉండడంతో ఆయన వేడుకలు రద్దు చేసుకున్నారు. జనసేన సిటీ కోఆర్డినేటర్ అనుశ్రీ సత్యనారాయణకు జనసేన శ్రేణులు శుభాకాంక్షలు తెలిపాయి. వైసీపీలో తటస్థంగా ఉంటున్న ఏపీఐఐసి మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం ఇంటి వద్దకు కూడా జనం బారులు తీరారు. అభిమానులు, వివిధ పార్టీ కార్యకర్తలు కూడా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాజానగరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ, జనసేన ఇన్‌చార్జి బత్తుల బలరామకృష్ణ ఇళ్ల వద్దకు కూడా సందడినెలకొంది. అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి పెద్దసంఖ్యలో శుభాకాంక్షలు తెలిపారు. కొవ్వూరులో మాజీ మంత్రి కెఎస్ జవహర్, ద్విసభ్య కమిటీ సభ్యుడు చౌదరి, రామకృష్ణలకు,జనసేన నేత టివి రామారావుకు శుభాకాంక్షలు తెలిపారు. గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో మద్దిపాటి వెంకట్రాజు, దేవరపల్లిలో మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వేంకటేశ్వరావు, నిడదవోలు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపూడి శేషారావు, సీనియర్‌నేత కుందుల సత్యనారాయణకు జనం , పార్టీకార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. రాజమహేంద్రవరంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాలకు వైసీపీ కార్యకర్తలు, అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. కొవ్వూరులో మంత్రి తానేటివనిత, గోపాలపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యేతలారి వెంకట్రావు, అనపర్తిలో ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, నిడదవోలులో ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ఇళ్ల వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు కొందరు ముందుగా తమ వర్గాలకు సమాచారం పంపించారు. కొంత మంది స్వచ్ఛందంగా వచ్చారు.



హ్యాపీ న్యూ ఇయర్ : నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీశ్, జేసీ తేజ్‌భరత్, డీఆర్‌వో నరసింహులు, కమిషనర్ దినేష్‌కుమార్, ఆర్‌డీవో చైత్రవర్షిణి, ట్రైనీ జేసీలు తదితరులు



వచ్చే ఎన్నికల్లో విజయం మనదే కావాలి : నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కొవ్వూరులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జవహర్‌కి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు, అభిమానులు



సీఎంకి పోస్టు.. కార్డు..

రాజమహేంద్రవరం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): 'సీఎం గార్కి నూతన సంవత్సర శుభాకాంక్షలు- మా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చండి మహాప్రభో' అంటూ సమగ్ర శిక్షా ఉద్యోగులు జగన్‌కి పోస్టు కార్డులు రాశారు.గత 13 రోజులుగా సమగ్ర శిక్షా ఉద్యోగులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న విషయం విదితమే. నూతన సంవత్సరం తొలి రోజు సోమవారం దీక్షలో పాల్గొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా తాము పడుతున్న ఇబ్బందులను సీఎంకి పోస్టు కార్డుల ద్వారా విన్నవించామని జేఏసీ నాయకులు ఎం.రఘునాథ్, డి.వంశీకృష్ణం రాజు, ఆర్.వెంకట్రాజు,మిరపరాజు, వెంకట్, కరుణాకర్ తెలిపారు. వివిధ సంఘాల నాయకులు శిబిరం వద్ద మద్దతు ప్రకటించారు.

ఆలయాలు కిటకిట



నిడదవోలు, జనవరి 1 : కొత్త ఏడాది ఆరంభం సందర్భంగా సోమవారం జిల్లావ్యాప్తంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడా యి. రాజమహేంద్రవరం, నిడదవోలు, భిక్కవోలులోని ప్రధాన ఆల యాలకు భక్తులు పోటెత్తారు.ఈ సందర్భంగా ఆలయాలను రక రకాల పువ్వులతో ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకుని భక్తులు పెద్ద ఎత్తున దర్శించు కున్నారు. నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా పలువురు భక్తులు పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాల నుంచి ఆలయాలకు తరలివచ్చి దర్శించుకున్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

అవగాహన సదస్సుకు రాజకీయ రంగులా!

కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు భారతి

కొవ్వూరు, జనవరి 1: ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై న్యాయవాదుల సంఘం నిర్వహించిన అవగాహన సదస్సుకు రాజకీయ రంగులు పులమడం సరికాదని కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతి అన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజలంతా సిరాస్తులు కలిగిన రైతులేనని, భూహక్కు చట్టంతో కలిగే దుష్పరిణామాలు వివరించడం న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలిగా తన బాధ్యత అన్నారు. ప్రాసిక్యూటర్‌గా నిష్పక్షపాతంగా బాధితులకు అండగా, బాధ్యతాయుతంగా పాలకపక్షం గౌరవం ఇనుమడించే విధంగానే తాను పనిచేశానన్నారు. నాయకుడిగా తన భర్త శంకరం ఎటువంటి రాజకీయ పైరవీలు చేయలేదన్నారు. తాళ్లపూడి మండలం మలకపల్లిలో న్యాయవాదుల సంఘం తరపున చేపట్టిన అవగాహనా సదస్సును సాకుగా తీసుకుని పార్టీలో అంతర్గత కలహాలను రెచ్చగొట్టడం పార్టీకి నష్టమే తప్ప, ఏ రకంగాను లాభం చేకూదని వైసీపీ నాయకులు గుర్తించాలన్నారు. వీలైతే భూహక్కు చట్టంపై న్యాయవాదులతో చర్చకు సిద్ధం కావాలన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

మునిసిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు



కొవ్వూరులో సమ్మె చేస్తున్న మునిసిపల్ కాంట్రాక్టు కార్మికులు

కొవ్వూరు, జనవరి 1: కరోనా సమయంలో కాళ్లు కడగడం కాదు, తమ కుటుంబాలను పోషించుకోవడానికి కనీస వేతనం అందజేయాలని మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొవ్వూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం 7వ రోజు కొనసాగింది. నూతన సంవత్సరం సందర్భంగా సమ్మె శిబిరం వద్ద కేక్ కట్‌చేసి నాయకులు, అధికారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మిక సంఘం నాయకుడు రాజాన అప్పారావు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం అంటున్నారని, మరి గడప గడపలో చెత్తనెత్తే తమను మర్చిపోతే ఎలా అని నిలదీశారు. ఆప్కాస్‌లో చేర్చి చేతులు దులుపుకుంటున్నారా అని ప్రశ్నించారు. ఇప్పటికయినా పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో పూజారి వాసు, భూపతి రవీంద్ర, కళ్యాణి రాజేష్, మీసాల ప్రేమ్, ఎం.జ్యోతి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు యాప్‌ల పనిభారం తగ్గించాలి

విలేకరులతో ముఖాముఖీలో యూటీఎఫ్ నాయకులు

నల్లజర్ల, జనవరి 1: ఉపాధ్యాయులకు యాప్‌ల పని భారం తగ్గించి విద్యా



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మనోహర్‌కుమార్

ర్థులకు సిలబస్ పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి సీహెచ్ మనోహర్‌కుమార్ పేర్కొన్నారు. నల్లజర్ల హైస్కూల్లో యూటీఎఫ్ నాయకులు సోమవారం స్థానిక విలేకర్లతో ముఖాముఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో విద్యార్థులు సులభంగా అర్థం చేసుకుని చదువుకునేందుకు యూటీఎఫ్ మోడల్ పేపర్‌ను ముద్రించి అన్ని సబ్జెక్ట్స్ రూ.75కే అందించిందన్నారు. గత పరీక్షల్లో ఈ మోడల్ పేపర్‌లో ప్రశ్నలు అధికంగా రావడం వల్ల ఉత్తీర్ణత శాతం పెరిగిందన్నారు. ఉపాధ్యాయుల సంక్షేమానికి వ్యతిరేకంగా ప్రభుత్వం సాగిస్తున్న విధానాలను మానుకోవాలని, పీఆర్‌సీ రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. పీఎఫ్ సొమ్ములను ఖాతాలో జమ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బండి కిషోర్, పల్లి వెంకటఅప్పారావు, ఏసుదాసు, ఎల్.నాగరాజు పాల్గొన్నారు.

దేవరపల్లిలో పింఛన్ల పంపిణీ

దేవరపల్లి, జనవరి 1: రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెంచిన పింఛన్ సొమ్ములను దేవరపల్లిలో సోమవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అందజేశారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జనార్దనరావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, కూచిపూడి సతీష్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, రాజేంద్రబాబు, సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు సర్పంచ్‌ల రాష్ట్రస్థాయి సమావేశం

దేవరపల్లి, జనవరి 1: గుంటూరు జిల్లా మంగళగిరిలో ఈ నెల 3వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు సర్పంచ్‌ల రాష్ట్రస్థాయి సమావేశం జరుగుతుందని, దీనికి పార్టీలకు అతీతంగా నియోజకవర్గంలోని సర్పంచ్‌లు హాజరు కావాలని సర్పంచ్‌ల ఛాంబర్ నియోజకవర్గ అధ్యక్షురాలు కరుటూరి ఉషారాణి పిలుపునిచ్చారు. రాష్ట్ర పంచాయతీ ఛాంబర్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు టీడీపీ అధినేత చంద్రబాబు హాజరవుతారని, అన్ని పార్టీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ పెన్షనర్ల నుంచి లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ

నిడదవోలు, జనవరి 1: నిడదవోలులోని సబ్‌ట్రెజరీ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల నుంచి లైఫ్ సర్టిఫికెట్ల స్వీకరణ ప్రారంభించామని సబ్‌ట్రెజరీ అధికారి జి.అప్పారావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బలగం అప్పారావు, కార్యదర్శి కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ ఈ నెల 1 నుంచి ఫిబ్రవరి 29వరకు సబ్‌ట్రెజరీ అధికార్లు లైఫ్ సర్టిఫికెట్లు స్వీకరించనున్నారన్నారు. కార్యక్రమంలో బొజ్జా పాపారావు, ఎలిపిన శేషగిరిరావు, పొన్నా సుబ్రహ్మణ్యం, శమంతకమణి, సామ్రాజ్యం పాల్గొన్నారు.

దళిత మృతులకు నివాళులు



సమిశ్రగూడెంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కేపీఎస్‌పీఎస్ నాయకులు

నిడదవోలు, జనవరి 1: దళితుల ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటాలను బలోపేతం చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యదర్శి గెడ్డం రవీంద్రబాబు అన్నారు. సోమవారం మండలం సమిశ్రగూడెంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1818 జనవరి 1న భీమానది ఒడ్డున భీమా కోరేగావ్ గ్రామంలో బ్రిటీష్ ఈస్టిండియా సైన్యానికి మరాఠ సమాఖ్యకు చెందిన పీష్వా సైన్యానికి జరిగిన పోరాటంలో ఎందరో దళితులు మృతి చెందారన్నారు. దళితుల ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటాలను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతాప్, శశికుమార్, రాజు, సతీష్, కృష్ణ, విజయ్ తదితర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్, వాలీబాల్ పోటీలు

గోపాలపురం, జనవరి 1: మండలంలోని వేళ్లచింతలగూడెం గ్రామంలో శ్రీకోదండరామ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు 24క్రికెట్ టీమ్‌లు నమోదు చేసుకున్నాయని, ఈ పోటీల్లో పాల్గొనే వారు ఆధార్‌కార్డుతో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



నన్నయ వర్సిటీలో నూతన సంవత్సరం డైరీ ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు



కొవ్వూరులో కేక్ కట్‌చేస్తున్న హోంమంత్రి వనిత



సుబ్బరాయచౌదరికి శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు



తాళ్లపూడి: బల్లిపాడులో కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే ముప్పిడి

హ్యాపీ న్యూఇయర్

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- పలుచోట్ల కేక్ కట్ చేసి సంబరాలు
- నాయకులు, అధికారులకు పలువురి శుభాకాంక్షలు
- ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి : జవహర్

కొవ్వూరు, జనవరి 1: ప్రభుత్వ వేధింపులు తట్టుకుని నూతన సంవత్సరంలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా భాగస్వామ్యం కావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కేఎస్ జవహర్ అన్నారు. నూతన సంవత్సర వేడుకలను పలుచోట్ల సోమవారం ఘనంగా నిర్వహించారు. కొవ్వూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జవహర్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలన్నారు. 2024పై రాష్ట్ర భవిష్యత్ ఆధారపడి ఉందన్నారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు జవహర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణారావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని నివాసాల్లో నాయకులు కేక్ కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు నివాసంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు నాయకులకు పుష్పగుచ్ఛాలు, పండ్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో వీఎస్ఎన్ వర్మ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు చెప్పారు. సబ్‌డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కొవ్వూరులోని క్యాంపు కార్యాలయంలో హోం మంత్రి తానేటి వనిత కేక్ కట్ చేసి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, నాయకులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో అందరూ సంతోషంగా, ఆనందంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పెనకనమెట్టలో సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ బండి లక్ష్మీనారాయణమ్మ, బండి పట్టాబి రామారావు తమ నివాసాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు.. నూతన సంవత్సరం సందర్భంగా కొవ్వూరు మెరకవీధిలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చిలో పాస్టర్ గెల్లా రాజన్‌బాబు, క్రైస్ట్ లూథరన్ టౌన్ చర్చిలో పాస్టర్ వారా జాషువా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అధికసంఖ్యలో సంఘస్తులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్నులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావును పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వేలివెన్నులో జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్యను, ఉండ్రాజవరంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరిని, వ్యవసాయ సలహా మండలి జిల్లా ఛైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావును వైసీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు కలసి శుభాకాంక్షలు తెలిపారు. పలు చర్చిల్లో నూతన సంవత్సర ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు జరిపి కేక్‌లను కట్ చేశారు.

దేవరపల్లి: దేవరపల్లిలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు క్యాంపు కార్యాలయం వద్ద నూతన సంవత్సర కేకును కట్ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు శుభాకంక్షలు తెలిపారు. ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ ఛైర్మన్ గన్నమని జనార్ధనరావు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, చినబాబు, సుంకర దుర్గారావు ఇంటి వద్ద అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. గొల్లగూడెంలో దివ్యాంగుల, వృద్ధాశ్రమంలో పొట్టి శ్రీరాములు స్మారకస్మృతి జాతీయ సహాయ కార్యదర్శి, పారిశ్రామికవేత్త శ్రీకాకుళపు కాళీకృష్ణ దుప్పట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. 20ఏళ్లుగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, వ్యక్తిగతంగానూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆశ్రమ నిర్వాహకుడు కాగిత భాస్కరరావుకు దుప్పట్లు, స్వీట్లు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వెంకట రామారావు, సుతాపల్లి రవికుమార్, శ్రీకాకుళపు మోహన్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడులో యువగళం నాయకుడు కాకర్ల సత్యేంద్ర ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. సత్యేంద్ర మాట్లాడుతూ కొవ్వూరు ఎమ్మెల్యేగా మంచి అభ్యర్థిని ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని తీపర్రులో టీడీపీ నాయకుడు కుందుల సత్యనారాయణ స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. నియోజకవర్గంలోని పలువురు టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడపాటి వెంకటరావు, అనపర్తి వెంకటనారాయణ, వాకలపూడి వెంకటరత్నం, తణుకుకు చెందిన మంత్రిరావు బాబు, కలగర వెంకట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరం: వేలివెన్నులో శేషారావుకు శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు



దేవరపల్లి:గొల్లగూడెంలో దివ్యాంగులకు దుప్పట్లు, స్వీట్లు అందజేసిన కాళీకృష్ణ



కొవ్వూరులో రామారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసైనికులు



పెరవలి: తీపర్రులో కుందులకు శుభాకాంక్షలు చెబుతున్న ప్రముఖులు

నూతన సంవత్సరంలో మరింత అభివృద్ధి

నన్నయ వర్సిటీ ఉపకులపతి పద్మరాజు

దివాన్‌చెరువు, జనవరి 1: ప్రస్తుత సంవత్సరంలో నూతన భవనాల నిర్మాణం, కొత్తకోర్సులు ప్రవేశపెట్టడంతో బాటు నూతన పోస్టులు తీసుకురావడం వంటి లక్ష్యాలతో పనిచేస్తున్నట్టు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. నూతన సంవత్సర వేడుకలను సోమవారం వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నన్నయ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం యూనివర్సిటీ డైరీని, క్యాలెండర్‌ను వీసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవనాల నిర్మాణం పూర్తయిన తరువాత నూతన కోర్సులు ప్రవేశపెడతామన్నారు. స్థానిక క్యాంపస్‌లో ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్ ఈ ఏడాది అందుబాటులోకి తెస్తామన్నారు. అలాగే కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్‌లలో చేస్తున్న ప్రతిపాదనలను, సమకూర్చుతున్న వసతులను వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, అధికార్లు, అధ్యాపకులు పాల్గొన్నారు. నన్నయ ప్రాంగణంలోని కళాశాలల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పుష్పగుచ్ఛాలతో వీసీకి శుభాకాంక్షలు తెలిపారు.

డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగిస్తాం

- ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ

కొవ్వూరు, జనవరి 1: తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చే వరకు సమ్మెను కొనసాగిస్తామని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 21వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని తమ డిమాండ్లతో ప్రశ్నిస్తూ, అంగన్వాడీలతో మ్యూజికల్ చైర్స్, ఖోఖో, కోలాటం, కబడ్డీ ఆటలు ఆడుతూ నిరసన తెలిపారు. మాణిక్యాంబ మాట్లాడుతూ సీఎం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ చెల్లించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ పుష్పావతి, ఎ.నరసమాంబ, బి.పద్మజ, బి.వసంత, డి.అమరావతి, వి.శ్రీదేవి, చిన్న లక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు పాల్గొన్నారు.



గోపాలపురంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



దేవరపల్లిలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గోపాలపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట రహదారిపై కేకును కోసి నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షురాలు రామలక్ష్మి మాట్లాడుతూ నూతన సంవత్సరంలోనైన సీఎం జగన్ మనస్సు మార్చుకుని వేతనాలు పెంచి హామీ నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలో బస్టాండ్ వద్ద అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు నో హ్యాపీ న్యూయర్ పేరుతో ముగ్గులు వేసి ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ మండలాధ్యక్షురాలు టీపీ లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, 2024 ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, అంగన్వాడీ నాయకులు రత్నాజీ, పద్మకామేశ్వరి, నర్సమ్మ, భవాని, మంగతాయారు. దేవి సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ

దేవరపల్లి, జనవరి 1: అయోధ్య రాముడి అక్షింతలకు మండలంలోని త్యాజం పూడి, లక్ష్మీపురం గ్రామాల్లో భక్తులు బాణసంచా కాల్పులు, బ్యాండు వాయిద్యా లతో గ్రామోత్సం నిర్వహించి, ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో త్యాజంపూడి సర్పంచ్ కుసులూరి స్వరూపరాణి, ఉపసర్పంచ్ కుసులూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని బల్లిపాడులో అయోధ్య రాముడి అక్షింతలను పెద్దేవం గ్రామ భజన మండలి సభ్యులు పంపిణీ చేశారు. గురువు జవ్వాది రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 1నుంచి 15 వరకు అక్షింతలతో పాటు కరపత్రాలు, శ్రీరాముని ఫొటోలు పంపిణీ చేస్తామన్నారు. అక్షింతలు గృహాలకు వచ్చిన తర్వాత భక్తులు తమ ఇళ్లలో ఐదు దీపాలను వెలగించాలని, రెండు పూజా మందిరంలో, రెండు గడపకు ఇరుప్రక్కలా, మరొకటి తులసి కోట వద్ద ఉంచి ఇంటిల్లపాది అక్షింతలు తలపై వేసుకోవాలన్నారు.

పెరవలి: మండలంలోని ఖండవల్లిలో అయోధ్య రాముని పూజా అక్షింతలకు గ్రామోత్సవం జరిపి ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామంలోని 19 రామాలయాలకు చెందిన కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తి సంకీర్తనలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.



దేవరపల్లి: త్యాజంపూడిలో అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు



పెరవలి: ఖండవల్లిలో అక్షింతలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నేటి నుంచి 'ఆరోగ్య సురక్ష'

రాజానగరం, జనవరి 1: మండలంలో ఈ నెల 2వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనిలో భాగంగా 2న దివాన్‌చెరువు గ్రామ సచివాలయం-1లో తొలిరోజు క్యాంపు జరుగుతుందన్నారు. దీనిపై ఇప్పటికే ఇంటింటి సర్వే నిర్వహించి కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయాలు తెలుసుకుని క్యాంపు జరిగే తేదీని ప్రజాప్రతినిధులకు తెలియజేశామన్నారు. ఈ శిబిరాల్లో అన్ని రకాలైన పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారని, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని సంబంధిత రిఫరల్ ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారన్నారు. మండలంలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

సీతానగరం, జనవరి 1: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ నుంచి వచ్చిన శ్రీరాముని దివ్య అక్షింతలను మండలంలోని సీతానగరం, పురుషోత్తపట్నం గ్రామాల్లో రామాలయ కమిటీ సభ్యులు భక్తులకు అందజేశారు. సోమవారం సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి అక్షింతలతో పాటు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ సభ్యులు అద్దె మల్లేశ్వరరావు, కొణపల అభిలాష, శ్రీవిద్య, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

అనపర్తి, జనవరి 1: అనపర్తిలో శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు టీటీడీ కల్యాణ మండపంలో మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఎనిమిది రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. 2న శ్రీనివాస కల్యాణం హరికథతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. 3న శ్రీరామ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం, 4,5,6 తేదీల్లో పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనాలు, 7న వేద పఠనం, స్వర లయ సుధ వాద్య సమ్మేళనం, 8న గాత్ర కచేరి, 9న కూచిపూడి భరతనాట్యం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

వృద్ధులకు చీరలు పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 1: రాజమహేంద్రవరం వీటీ డిగ్రీ కళాశాల ఆనంద గార్డెన్స్‌లో సోమవారం వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు స్వీట్లు, చీరలు పంపిణీ చేశారు. రాజమహేంద్రవరంలోని ఎస్ఎస్ మాల్ అధినేత బీఎస్‌డీ బీఎస్ సింగ్ దంపతులు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం క్లబ్‌లోని వృద్ధులకు చీరలు పంచారు. ఈ సందర్భంగా దాతలను లాఫింగ్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జగ్గంపేట, జనవరి 1: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవ రంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కొండేపూడి నవీన్, కల్యాణం చిన్న, సింగర్ల మహేష్ బాబుతో కలిసి ముమ్మిడివరపు నారయ్య సప్లయ్ కంపెనీలో పనిచేస్తున్నారు. మోటారు సైకిల్‌పై జగ్గంపేటలో బిర్యానీ పార్శిల్ కోసం వెళ్లగా రాజమండ్రి నుంచి విశాఖవైపు వెళ్తున్న లారీ ఢీ కొనడంతో వారు రోడ్డుపై పడ్డారు. నవీన్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడి కక్కడే చనిపోయాడు. జగ్గంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అటవీ ఉద్యోగులకు శిక్షణ ఎంతో ముఖ్యం

అటవీ అకాడమీ డైరెక్టర్ ఉదయభాస్కర్

దివాన్‌చెరువు, జనవరి1: అటవీశాఖ ఉద్యోగులకు శిక్షణ ఎంతో ముఖ్య మని దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ శిక్షణా సంస్థ డైరెక్టర్ పీఏవీ ఉదయ భాస్కర్ అన్నారు. అటవీ అకాడమీలో శిక్షణ పొందుతున్న 54 మంది ఎఫ్ ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలకు శిక్షణా కార్యక్రమానికి అవసరమైన సామగ్రితో కూడిన కిట్‌ను సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ అటవీ అకాడమీకి సొంత భవనం నిర్మాణానికి రూ.30 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపామని చెప్పారు. దీనికి ఆమో దం లభించగానే పనులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధి కారి దామోదర్, ఫ్యాకల్టీసభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న అటవీ ఉద్యోగులకు కిట్‌లు అందజేస్తున్న ఉదయభాస్కర్

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	డెవిల్
వై.స్క్రీన్2	సలార్
దేవిశ్రీ(గాయత్రి)	హాయ్ నాన్న
అనన్య	సలార్
నిడదవోలు	
వీ మ్యాక్స్	డెవిల్
రాధాకృష్ణ	వెంకి
శ్రీగణపతి	సలార్
దేవరపల్లి	
శ్రీరామ్ సినీ మ్యాక్స్	సలార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	సలార్
నల్లజర్ల	
శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్